తెలుగు కళాసమితి (న్యూజెర్సీ)వారి 1986 మినీ కథల పోటీలో సాధారణ ప్రచురణకు ఎన్నికైన కథ

# కొత్త సాంప్రదాయం

## పి. మాధవరావు

"ఏమండి టిక్కెట్లు రిజర్వుచేశారా ఇవాళన్నా"

"ఏమి టిక్కెట్లు-సినిమా టిక్కెట్లా?"

"అయ్యో! సినిమా టిక్కెట్లేమిటండీ! అమలాపురం బస్సు టిక్కెట్లు; సంక్రాంతికి రమ్మని ఉత్తరం రాస్తే. ఎలాగూ రాలేదు, ఉగాదికయినా తప్పకుండా రమ్మని మానాన్న గారు ఉత్తరం రాశారు కదండీ"

" ఇదిగోఊర్మిళా! ఆ ఉత్తరం వచ్చిన రోజునే చెప్పానా మనం వెళ్ళేది లేదని" చెప్పాడు లక్ష్మణరావు. "ఆఁ మీరలాగే అంటారు లెండి. తప్పకుండా రావాలి తప్పకుండా రావాలి అని ఉత్తరంలో మూడుసార్లు వ్రాశారు"

"మూడుసార్లేం కర్మ 30 సార్లు రాయొచ్చు నాలుగక్షరాలేకదా!" లక్ష్మణరావు సణిగాడు. "అయితే ఏంచేయాలంటారు! ఓహో! వచ్చి తీసుకెళ్ళలేదనా అబ్బాయి గారి కోపం" "వచ్చి తీసుకెళ్ళటానికి మనకేమయినా దారి తెలియదనా! చిన్న పాపాయి లమనా!". "మరింకేమిటండీ మీ అభ్యంతరం." "మనం నాలుగయిదొందలు ఖర్చు పెట్టుకొని వెళ్ళటమే కాని ఏం ప్రయోజనం. కూతురు అల్లుడు వచ్చారే పండక్కి ఏదయినా మంచి వస్తువు కొనిద్దామని అనుకుంటారా మీ వాళ్ళు? అదేం లేదు. మరెందుకు వెళ్ళాలి? అటు శలవు దండగ, ఇటు ఛార్జీలు దండగ".

"అయ్యో అదేమిటండీ నాలుగయిదు రకాల పిండి వంటలు చేస్తారుగదా. వీలయితే బట్టలు కూడా పెడతారు".

"ఏం పెడతార్లే బట్టలు. ఛార్జీల డబ్బులు పెట్టుకుంటే మనం కొనుక్కోలేమా ఆ బట్టలు. మనం వండుకోలేమా పిండి వంటలు". బట్టలు, పిండి వంటలు అనే మాటల్ని సాగదీసి పలికాడు లక్ష్మణరావు వ్యంగ్యంగా.

"మీరేం ఎగతాళి చెయ్యక్కర్లా-వాళ్లకు చేతనయిందేదో పెడతారు." "ఏదో పెడితే ఏం లాభమోయ్! అత్తగారన్నాక, పండక్కి రమ్మన్నాక మంచి ఖరీదయిన వస్తువేదయినా ఇవ్వాలి. నా పక్క సీటు రమణయ్య గాడి సంగతి చూడు. మొన్న సంక్రాంతికి అత్తగారింటికెళ్ళాడా! వస్తూ వస్తూ కలర్ టీవీ తెచ్చుకున్నాడు. మన ఎదురింటి రాఘవరావుకి చూడు పెళ్ళయి ఆరేళ్ళయినా మొన్న పండక్కి ఫ్రిజ్ కొని పెట్టారు మామగారు. మా ఫ్రెండు ప్రసాద్ తెలుసుగా! పెళ్ళికి డెబ్భయ్ వేలు కట్నం తీసుకున్నాడా! సంక్రాంతికి మళ్ళీ స్కూటరు కొని పెట్టారు. అత్తగార్లంటే అలా వుండాలి. అక్షయ పాత్రలా ఎప్పుడేదడిగితే అదివ్వాలి. అంతేగాని ఇంతదూరం నుండి రప్పించి గారెలు,బూరెలు,అప్పడాలు,ఒడియాలు-ఇవ్వా పెట్టేది"

ఏడిపించటానికి లక్ష్మణరావుకి సరదాగా వున్నాఊర్మిళకి మాత్రం ఎంతో బాధేసింది చెప్పొద్దూ.

"చూడండి ఎంతచెట్టు కంత గాలి అన్నట్లు మర్యాదలు ఎవరి తాహతుకొద్ది వాళ్ళు చేస్తారు. స్కూటర్లు, టి.వీలు ఇచ్చారంటే వాళ్ళు లక్షాధికారు లయ్యుంటారు. లక్షాధికారుల పోకడలు సామాన్యులు పోగలరా చెప్పండి" అనునయంగా చెప్పింది ఊర్మిళ. "నాబోంది లక్షాధికార్లూ కాదు, కోటీశ్వరులూ కాదు. ఏదో అల్లుడు ముచ్చటపడి అడిగాడు కదాని అప్పో సప్పోచేసి కొని పెట్టారంట". "వాళ్ళతాహతుకు మించిన కోర్కెలు కోరి వాళ్ళను అప్పులపాలు చేయటం ఏం న్యాయమంటారు చెప్పండి".

"న్యాయా న్యాయాలు ఎవడిక్కావాలోయ్ ఈ






జీవిత భీమా సంస్థ 30వ వార్షికోత్సవం సందర్భంగా ఇటీవల విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నృత్య ప్రదర్శన ఇచ్చిన కుమారి వి. మమత

రోజుల్లో. నీకు బొత్తిగా లోక జ్ఞానం వున్నట్టు లేదు. న్యాయం, ధర్మం అనుకుంటూ కూర్చుంటే ఇక సంసారం ఒదిలేసి జై సీతారామ్ అంటూ వీధుల వెంట పడాల్సిందే. ఏదోవిధంగా సొమ్ముజేసుకోవటమే ఈనాటి న్యాయం." "కొండంత అప్పుల భారాన్ని బాధనీ గుండెల్లో దాచుకొని పైకి నవ్వుతూ వాళ్ళిచ్చేకానుకలు సంతోషంగా స్వీకరించగలమా చెప్పండి." "అదుగో మళ్ళీ అమాయకంగా మాట్లాడుతున్నావ్! అప్పుతెచ్చి ఇచ్చారా, ఇల్లమ్మి ఇచ్చారా, ఏడుస్తూ ఇచ్చారా, నవ్వుతూ ఇచ్చారా అనేది కాదు ముఖ్యం. ఏమిచ్చారనేది ముఖ్యం.' భర్త వితండ వాదానికి ఒళ్ళు మండి పోయింది ఊర్మిళకి.

"మా వాళ్ళు ఏమీ ఇవ్వరండీ.ఊరికి వస్తారా? రారా? చెప్పండి" కయ్యానికి దిగింది.

"ఊరికి వస్తారా? రారా ? అంటున్నావు నేను రాకపోతే నువ్వెళ్లి పోతావా?" సాగదీసాడు లక్ష్మణరావు.

"ఓ!నేను రేపు వెళ్ళిపోతాను. పండుగ ఇంక నాలుగు రోజులే వుంది. వెళ్ళకపోతే మా నాన్న గారు బాధ పడతారు."


"వెళతావా" "ఓ వెళతాను" మొండిగా సమాధానం చెప్పింది ఊర్మిళ. "ఎలా వెళతావో చూస్తాను. నువ్వెళ్ళటానికి ఏ మాత్రం వీలు లేదు." అధికారం ప్రదర్శించాడు. ఇంతసేపూ భర్త పరదాగా మాట్లాడుతున్నాడనుకొంది. నిజంగా వద్దంటున్నాడేమోనని అనుమానమొచ్చి అడిగింది.

"ఏమండీ అసలు మీరేనా ఇలా మాట్లాడుతున్నది. ఏ నాడూ ఇతరుల సొమ్ము పైసా కూడా ఆశించని మీరు ఎందుకిలా అంటున్నారో నాకర్థం కావటంలా"

"మనిషెప్పుడూ ఒకే విధంగా వుండడు ఊర్మిళా. ఆ మాటకొస్తే మనిషే కాదు ప్రకృతిలో ఏదీ స్థిరంగా వుండదు. మార్పు సహజం. కాబట్టే నాలో మార్పొచ్చిందని నువ్వేమీ ఆశ్చర్య పడనక్కర్లా"

"అయితే నన్ను కూడా వెళ్ళొద్దంటారా" ఆఖరి మాటగా అడిగింది."వెళ్ళొద్దంటారా ఏమిటే, వెళ్ళటానికి వీల్లేదంటూంటే" నిష్కర్షగా చెప్పేసాడు లక్ష్మణ రావు. ఏడుపొచ్చినంత పనయింది ఊర్మిళకి. నిస్సహాయురాలై విచార వదనంతో పడక కుర్చీలో కూలబడింది.

ఆ రోజే ఉగాది. ఓ పక్క ఏదోపని చేసు కుంటున్నా వూరికి పోలేదని అమ్మా, నాన్న ఏమను కుంటున్నారో ననే బాధ మరో పక్క వేధిస్తూనే వుంది ఊర్మిళని. తలుపు తట్టిన చప్పుడై తలుపు తెరవగానే వాకిట్లో ప్రత్యక్షమయిన అమ్మా, నాన్నలను చూసి ఆనందం, ఆశ్చర్యం కలిసి తబ్బిబ్బు చేయగా మాట లేకుండా నిలబడిపోయింది ఒక నిముషంపాటు. వెంటనే తేరుకుని అమ్మ చేతిలోని సూట్ కేసందుకు ని లోనికి తీసుకెళ్ళింది. ఎందుకు రాలేదనడిగితే ఏం చెప్పాలని




లోలోన మథనపడుతున్నది ఊర్మిళ. అదోలావున్న కూతుర్ని చూసి "ఏమ్మా అలా వున్నావు-వొంట్లో బాగాలేదా?" అడిగింది తల్లి. " అబ్బే అదేం లేదమ్మా బాగానే వుంది". " ఆరోగ్యం బాగా లేకపోతే అల్లుడు గారు ఉత్తరంలో రాయక పోదురా" అన్నాడు ఊర్మిళ తండ్రి, భార్య వంక చూస్తూ.'ఉత్తరం రాశారా? నాకు చెప్పనేలేదే!' మనసులో అనుకొని"ఏం రాశారు?"అని అడగబోయి ఏమనుకుంటారోనని ఆగింది. "ఎంత సేపయిందండీ వచ్చి, కులాసాగా వున్నారా" అంటూ రెండు చేతుల్లో రెండు పేకెట్లతో లోపలికొచ్చాడు లక్ష్మణరావు. అందరూ కలిసి కాస్సేపు అవీ ఇవీ మాట్లాడుకున్నారు.

ఊర్మిళ వంట గదిలోకి వెళ్ళగానే లక్ష్మణరావు కూడా వెళ్ళాడు. "సారీ ఊర్మిళా ఏమనుకోకు. నిన్ను సర్‌ప్రైజ్ చెయ్యాలని నీకీ విషయం చెప్పలేదు. నేను కేంప్‌కు వెళుతున్నాను, అందువల్ల అమలాపురం రావటానికి కుదరదు, పండుగరోజుకు తిరిగి వస్తాను. కాబట్టే మీరే ఇక్కడకు రండి అని ఉత్తరం రాశాను మీ నాన్న గారికి. మామూలుగా అయితే వస్తారో రారో అని ఒక ముఖ్యమయిన విషయం మాట్లాడాలి తప్పకుండా రమ్మని వ్రాసాను. ఏదో ఆచారం కొద్దీ మనల్ని రమ్మని వ్రాసారు కాని అందువల్లయ్యే ఖర్చు భరించే శక్తి వాళ్ళకు లేదని నాకు తెలుసు. మీ నాన్న గారికొచ్చే పెన్షనే కదా వాళ్ళకాధారం. అందుకే అక్కడకు వెళ్ళి వాళ్ళను బాధపెట్టటమెందుకని ఇలా చేశాను. రెండు వందల రూపాయలు మనియార్డరు కూడా చేశాను, వాళ్ళు వెంటనే రావటానికి వీలుగా. ఇవిగో ఈ బట్టలు మీనాన్న గారికి ఇవి మీ అమ్మ గారికి" అంటూ పేకెట్లు విప్పి చూపించాడు. ఊర్మిళ మనసులో ఆనంద తరంగాలు వువ్వెత్తున పొంగిపడినాయి. శ్రీవారి మంచితనాన్ని కొనియాడటానికి మాటలు కరువయినాయి. నయనాలు మాత్రం కృతజ్ఞత, ఆరాధనభావాలకు ప్రతినిధులుగా రెండు నీటి బిందువులను రాల్చకుండా వుండలేకపోయినాయ్. మౌనంగా అతని హృదయంపై తలవాల్చి కొద్ది నిముషాలుండిపోయింది ఊర్మిళ.

మామగారు, అత్తగారు స్నానం చేసి బట్టలు మార్చుకొని సోఫాలో కూర్చున్నారు. "ఏమిటి బాబు ఏదో మఖ్యమయిన విషయం మాట్లాడాలని లెటరులో వ్రాశావు" అడిగారు మామగారు లక్ష్మణరావుని. " ఏమీ లేదండి. మామూలుగా మన సాంప్రదాయం ప్రకారం, అల్లుళ్లనూ, కూతుళ్ళనూ ముఖ్యమయిన పండుగలకు ఆహ్వానించి కొత్త బట్టలు ఇతర కానుకలు ఇవ్వటం పరిపాటి. కాని పండుగకు అత్త మామలను ఆహ్వానించి నూతన వస్త్రాలు కట్టబెట్టి ఆనంద దాయకంగా అందరూ కలిసి పండుగను నిజమైన పండుగగా జరుపుకొనే కొత్త సాంప్రదాయాన్ని నెలకొల్పాలని మిమ్ములను ఆహ్వానించాను. ఇవిగో ఈ బట్టలు కట్టుకోండి" అంటూ కొత్త బట్టలందించాడు లక్ష్మణరావు.

రెండు వందల రూపాయలు మనియార్డరు ఎందుకు చేశాడో ఇప్పుడర్థమయింది మామగార్కి. ఆయన కళ్ళలో అభిమానజ్యోతులు వెలిగాయి. ఆ ఇంట్లో ఆనందం వెల్లివిరిసింది.